క్లుప్తంగా

మండల ప్రత్యేక అధికారిగా సదానందం


బాధ్యతలు స్వీకరిస్తున్న సదానందం

కనగల్ : మండల ప్రత్యేక అధికారిగా పశు సంవర్ధశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అనిమల్ సదానందంను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సదానందం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, మండల వెటర్నరీ డాక్టర్ సీహెచ్ బాబు, ఏపీఎం సుధాకర్ తదితరులు ఉన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నిషేధం

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని రకాల వ్యాపార సముదాయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను కలెక్టర్ ఆదేశాల మేరకు నిషేధిస్తున్నట్లు మున్సిపల్ మేనేజర్ అరుణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న కవర్లను అమ్మినా, కొనుగోలు చేసినా రూ.10,000 జరిమానా విధిస్తామన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన సుంకరబోయిన కమలమ్మ, జిట్టగోని మల్లమ్మ, లింగాల లింగమ్మలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ట్రస్ట్ సభ్యుల ద్వారా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కోనేటి యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు సైదులు, పల్లపు బుద్ధుడు, ఉయ్యాల నరేష్, శ్రీను, మర్రి రమేష్, మేడబోయిన శ్రీనివాస్, గోపాల్, శంకర్, స్వామి పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా వీరయ్య

నార్కట్‌పల్లి : బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లింగాల వీరయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాచం కృష్ణమూర్తికి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు


నల్లగొండ టౌన్: పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘ నేత కాచం కృష్ణమూర్తి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, బొల్లు రవీందర్, శివ పాల్గొన్నారు.

సామగ్రి అందజేత


సామగ్రి అందజేస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని మాల్ బౌలి ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఫ్రెండ్స్ హెల్పింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాఉద్దీన్ ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు విద్యార్థులకు స్టీల్ గ్లాసులు ఇతర సామగ్రి అందజేశారు. వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, ప్రధానోపాధ్యాయురాలు లలితాదేవి, పద్మకుమారి, హబీబుర్ అహ్మద్ జుబేరు, ఉపాధ్యాయులు పి.యాలాద్రి, సుశీల, కానిస్టేబుల్ శ్రీకాంత్, షకీల్, ఎండీ. షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న హఫీజ్

కనగల్: మండల కేంద్రానికి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు, సామాజిక వేత్త ఎండీ హఫీజ్ డాక్టరేట్ అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎలివేట్ కల్చరల్, ఎలైట్ హిమాయత్‌సాగర్, హైదరాబాద్ ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్, ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్, ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ అంజనీకుమార్, సినీ నటుడు, మా ఈసీ మెంబర్ డాక్టర్ చింతకంట రాంమాణిక్‌రావు, మూవీ ఆర్టిస్ట్ అర్జున్ రావులు ఆయనకు డాక్టరేట్ అందించారు.

గురుకుల భవనం పూర్తయ్యేదెప్పుడు ?

- నిర్మాణానికి రూ.19 కోట్లు మంజూరు
- ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభం
- నేటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు
- చెట్ల కిందనే తరగతుల నిర్వహణ


నిర్మాణంలో ఉన్న మూసీ గురుకుల పాఠశాల, వసతి గృహాల సముదాయం


చెట్ల కింద చదువులు కొనసాగిస్తున్న విద్యార్థులు

కేతేపల్లి: మండలంలోని మూసీ ప్రాజెక్టు వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల పక్కా భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాల, వసతి గృహ భవనాల నిర్మాణ పనులు ప్రారంభమై ఏడేళ్లు కావొస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. పాఠశాలలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

17 ఏళ్లుగా రేకుల షెడ్లు, చెట్ల కిందనే..

మూసీ ప్రాజెక్టు వద్ద బీసీ బాలుర కోసం 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను మంజూరు చేశారు. నాడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత ఇక్కడ మాత్రమే బీసీ బాలురకు గురుకుల పాఠశాల ఏర్పాటయింది. మూసీ డ్యాం దిగువన ఉన్న నీటి పారుదల శాఖ గ్యాంగ్‌మెన్‌ల క్వార్టర్స్‌కు మరమ్మతులు చేసి విద్యార్థులకు పాఠశాల, వసతి కోసం తాత్కాలికంగా వినియోగించారు. ఆ తర్వాత రెండు భవనాలు మంజూరైనా పాఠశాల నిర్వహణకు అవి ఏమాత్రం చాలడం లేదు. గురుకుల సొసైటీ నిబంధనల మేరకు ఈ పాఠశాలలో 480 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాల్సి ఉంది. అయితే ఈ పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో ప్రస్తుతం 240 మంది విద్యార్థులకు మాత్రమే వసతి కల్పిస్తున్నారు. పదో తరగతిలో ప్రతి ఏటా వందశాతం మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవుతున్నా ఈ పాఠశాలను 17 ఏళ్లుగా రేకుల షెడ్లు, చెట్ల కిందనే నిర్వహిస్తున్నారు.

2016లో నిధులు మంజూరు

పాఠశాల అభివృద్ధి కోసం 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రు.19 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో తరగతి గదులకు పక్కా భవనం, విద్యార్థుల వసతి గృహం, వంటశాల, డైనింగ్ హాల్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బందికి నివాస గృహాల సముదాయాలు నిర్మించాల్సి ఉంది. 2017 జనవరిలో కాంట్రాక్టరు భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. దాదాపు రూ.5 కోట్ల మేర పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపివేశాడు. మూడేళ్లపాటు పనుల్లో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. ఇదిలా ఉండగా సదరు కాంట్రాక్టర్ మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పాఠశాల భవన నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో అందులో పిచ్చి మొక్కలు, కంప చెట్లు మొలిచాయి. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం భవన నిర్మాణ పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఏడాది క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మరో రూ.5 కోట్ల మేర పనులు పూర్తి చేశాడు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లు చెల్లించనట్లు తెలిసింది. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన నిధులు ఆగిపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

చెట్ల కిందనే చదువులు

గదులు ఇరుకుగా ఉండడంతో ఉక్కపోతతో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. దీంతో పాఠశాలలోని ఆరు తరగతులను ఆవరణలో ఉన్న చెట్ల కిందనే నిర్వహిస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు మాత్రమే విద్యార్థులను రేకుల గదుల్లో కూర్చొబెడుతున్నారు. సరిపోను గదులు లేకపోవడంతో విద్యార్థులు తమ సామగ్రిని ఉంచిన గదిలోనే, రాత్రి వేళ నిద్రపోవాల్సి వస్తోంది. మరోవైపు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

నార్కట్‌పల్లికి తరలిన కళాశాల

గురుకులాల అప్‌గ్రేడ్‌లో భాగంగా 2017 మూసీ గురుకులాన్ని జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఎలాంటి వసతులు మెరుగుపర్చకుండా 2017–18 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో 160 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించడంతో మరింత ఇబ్బందిగా మారింది. 2018–19 విద్యా సంవత్సరానికి కూడా పక్కా భవనం అందుబాటులోకి రాకపోవడంతో ఇంత మంది విద్యార్థులకు తాత్కాలిక గదుల్లో తరగతులు, వసతి కల్పించే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో తప్పని పరిస్థితుల్లో ఆరేళ్ల క్రితం కళాశాలను నార్కట్‌పల్లికి తరలించి అక్కడ ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల చేయించి పక్కా భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. వచ్చే విద్యా సంవత్సరం నాటికైనా భవనం అందుబాటులోకి వచ్చేలా చూడాలి.

– బొజ్జ చినవెంకులు

60 శాతం పనులు పూర్తయ్యాయి

గురుకుల భవనాల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో ఆలస్యం అవుతోంది. దీంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికి రూ.10 కోట్ల మేర పనులు జరిగాయి. 60 శాతం మేర భవన సముదాయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రవీందర్‌రెడ్డి, ఏఈ

‘స్వచ్ఛదనం–పచ్చదనం’ జయప్రదం చేయండి


నల్లగొండ టూటౌన్ : మాట్లాడుతున్న కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో చేపట్టనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ కోరారు. శుక్రవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5 నుంచి ప్రారంభంకానున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పట్టణంలో పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నివాసాల వద్ద, కమ్యూనిటీ హాల్స్ వద్ద మొక్కలు నాటాలని, వ్యర్థాలను వేరు చేసి సేకరించాలని, రహదారులను, ప్రభుత్వ స్థలాలను శుభ్రం చేయాలని, పాఠశాలల్లో పరిశుభ్రతపై పోటీలు నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.జ్ఞానప్రకాశ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, పరిసరాలను పరిశుభ్రం చేయడం, డ్రెయినేజీల్లో చెత్త తొలగించడం, బ్లీచింగ్ చల్లడం, మంచినీటి ట్యాంకులను శుభ్రపరచడం చేస్తారని తెలిపారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు


నకిరేకల్ : గుడ్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌లో గల అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ ఏఎన్ఎం ఎన్.శిరీషగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు మనీషా, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు నాగమణి, రాణి, పద్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : మున్సిపాలిటీలోని 4,5,6 అంగన్ వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని కురుమర్తి, ఎరసానిగూడెం గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నవనీత, అనురాధ, మమత పాల్గొన్నారు.

తిప్పర్తి : తల్లిపాలు బిడ్డలకు వరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–3 కేంద్రంలో బాలింతలకు తల్లిపాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ టీచర్ జానమ్మ, మమత పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని అక్కెనపల్లి, బి వెల్లంల గ్రామాల్లో శుక్రవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అంజలి, సరిత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభావతి, పద్మ, అనిత, మహేశ్వరి, కవిత, మౌనిత, సుకన్య, శంకరమ్మ, రేణుక ఉన్నారు.

మునుగోడు: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని సింగారం గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది జి.యశోద, మైబు, ఆశా కార్యకర్త సుగుణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

చండూరు(గట్టుప్పల్) : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గట్టుప్పల్‌లో శుక్రవారం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులు మాట్లాడుతూ చేనేత త్రిఫ్ట్, బీమా, చేనేత మిత్ర, నూలు సబ్సిడీ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చేనేత రుణాలు మాఫీ చేయాలని, చేనేత కార్మికులకు పని కల్పించాలని, సొసైటీల్లో నిల్వ ఉన్న చీరలను ఖరీదు చేయాలని కోరారు. ఇడెం కైలాసం, కార్మిక సంఘం అధ్యక్షుడు అందె రాము, కర్నాటి వెంకటేశం, గడ్డం కృష్ణయ్య, నామని స్వామి, రాపోలు సత్తయ్య, చెరుపల్లి రమేష్ నేత, గంజి పెద్దులు, జెల్లా అంజయ్య, పున్న రమేష్‌ఎ నర్సింహ, గంజి శంకర్, కొంగరి పాండు, నరహరి, కర్నాటి అశోక్, సంగెపు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణలో శ్రీ శాంభవీ దేవి


నేరడ ఆలయంలో శాకాంబరి అలంకరణలో శ్రీ శాంభవీ దేవి

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామం శ్రీ శాంభవీ దేవి ఆలయంలో అమ్మవారు ఆషాఢమాసం చివరి శుక్రవారం సందర్భంగా శాకాంబరి దేవిగా దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెండోట సత్యనారాయణ, అర్చకుడు శివకిరణ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

6న చొల్లేడులో గద్దర్ వర్ధంతి

మునుగోడు: ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని తెలంగాణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6న చొల్లేడు గ్రామంలో నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు వనం లింగయ్య, రడం నర్సింగ్‌రావు తెలిపారు. వర్ధంతి సభ కరపత్రాన్ని శుక్రవారం మునుగోడులో వారు విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కళాకారులు జీడిమెట్ల రవీందర్, శివరాత్రి రాములు, మేడి సైదులు, ఇరిగి శ్రీనివాసులు, మాలిగ యాదయ్య పాల్గొన్నారు.

నిరంతరం ప్రజాసేవలోనే కమ్యూనిస్టులు


జంగమ్మ స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న చెరుపల్లి సీతారాములు

చిట్యాల: ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా కమ్యూనిస్టు పార్టీ నాయకులు నిరంతరం ప్రజాసేవలోనే ఉంటారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. చిట్యాల మండలంలోని సుంకెనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఆవుల జంగమ్మ సంతాప సభలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జంగమ్మ స్మారక స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాలకు దూరంగా ఉన్నందున కమ్యూనిస్టులు కొంత బలహీనంగా కనబడుతున్నారని, అయినప్పటికీ భవిష్యత్‌లో కమ్యూనిస్టు పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గదన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, మండల రూరల్ కార్యదర్శి అర్రూరి శ్రీను, కత్తుల లింగస్వామి, మెట్టు నర్సింహ, లింగారెడ్డి, దేశబోయిన లింగస్వామి, కత్తుల యాదయ్య, కక్కిరేణి బొందయ్య, ఆవుల యాదయ్య, అండాలు, ఆవుల యాదగిరి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు


నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

మునుగోడు: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి గుణపాఠం తప్పదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్జ రామచంద్రం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బండా శ్రీశైలం అన్నారు. శుక్రవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, బడ్జెట్ మొత్తం పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో బండమీది యాదయ్య, మందుల పాండు, బొల్గూరి నర్సింహ, బండారి శంకర్, దుబ్బ వెంకన్న, కురుమర్తి ముత్తయ్య, శ్రీను, ముత్యాలు, హనుమయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


నల్లగొండ క్రైం: మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ క్రైం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గంజాయి తాగడం వల్ల వచ్చే అనర్థాలు, కొత్తగా వచ్చిన చట్టాలపై శుక్రవారం పట్టణంలోని మాల్‌బౌలి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురి కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శంకర్, ప్రధానోపాధ్యాయుడు రెహమాన్, సుమలత, షరీఫ్, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు : విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని సీఐ వెంకటయ్య అన్నారు. చండూరు డాన్ బాస్కో కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా ప్రజలు ఎవరైనా సరే గంజాయికి సంబంధించిన సమాచారం కంట్రోల్ రూమ్ 8712670266 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు

భక్తిశ్రద్ధలతో మాస కల్యాణం


కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాస కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జిగురు లక్ష్మీనర్సింహమూర్తి ఆధ్వర్యంలో రుద్ర హోమం, పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్, మాజీ చైర్మన్‌లు కొండ జానయ్య గౌడ్, వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గుండా వెంకటయ్య, వీరవెల్లి రఘునాథ్, ధర్మకర్తలు కొండ వెంకన్నగౌడ్, చెన్న చంద్రశేఖర్, కందాల ప్రవీణ రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీడర్ చానల్ పునరుద్ధరణ పనులు ప్రారంభం

కనగల్ : ఏఎమ్మార్పీ ఫీడర్ చానల్ డీ 25, 6ఎల్ కాలువల పునరుద్ధరణ పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ప్రారంభించారు. కాలువలను పునరుద్ధరించాలని జి.యడవల్లి, బండమీదిగూడెం, మార్తినేనిగూడెం, బచ్చన్నగూడెం, కుమ్మరిగూడెం, బుడుమర్లపల్లి రైతులు అనూప్‌రెడ్డితో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. దీంతో మంత్రి తక్షణమే రూ.5 లక్షల నిధులు విడుదల చేయించారు. ఈ కార్యక్రమంలో జి యడవల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కొర్వి శంకర్, బొడ్డుపల్లి శ్రీను, కారింగ్ సైదులు, రేఖ సురేందర్, గుండెబోయిన శ్రీనివాస్, కట్ట నాగయ్య, మల్లేష్, విజయ్, కృష్ణయ్య, మహేష్, నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నామాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనులు

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల పరిధిలోని నామాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనులకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ కంచుకట్ల సంపత్ ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గుంతలను పూడ్చి వేయించారు.

కరపత్రాల విడుదల

చండూరు : వినియోగదారుల రక్షణ చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి రెండు రోజుల శిక్షణ శిబిరం నాగార్జున సాగర్‌లో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నామని జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షుడు ఏ.హిమగిరి తెలిపారు. శుక్రవారం చండూరులో చలో నాగార్జున సాగర్ కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. చండూరు వినియోగదారుల సంఘం అధ్యక్షుడు తిరందాస్ ఆంజనేయులు, తాందరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం

శాలిగౌరారం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునిల్, చింత ధనుంజయ్య, కూరం లింగయ్య, బట్ట శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

14న విజ్ఞాన కేంద్రం ప్రారంభం

కట్టంగూర్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బూరుగు అంజయ్య 21వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 14న ఈదులూరు గ్రామంలో అంజన్న విజ్ఞానకేంద్రం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు బూరుగు సత్తయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఈదులూరులో సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు


కట్టంగూర్ : పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచులు

కట్టంగూర్ : పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో గుర్రం సైదులు, వడ్డె సైదిరెడ్డి, దాసరి సంజయ్‌కుమార్, పరుశురాములు, పనస సైదులు, సిలిగిరెడ్డి శేఖర్‌రెడ్డి, వనం సైదులు, యాదగిరి ఉన్నారు.

కనగల్ : అసెంబ్లీ ముట్టడికి వెళ్లనున్న మండలంలోని మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయినవారిలో సింగం కోటేశ్, చింతల యాదగిరి, వంగాల భాస్కర్‌రెడ్డి, పగిళ్ల యాదయ్య, చనగాని రాంచంద్రు, ఆదిమల్ల లింగయ్య, హేమనాయక్ తదితరులు ఉన్నారు.

కేతేపల్లి: పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సచివాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న కేతేపల్లి మండలంలోని పలువురు మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బడుగుల శ్రీనివాస్‌యాదవ్, జాల వెంకట్‌రెడ్డి, కట్ట శ్రవణ్‌లు తదితరులు ఉన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతి

నాంపల్లి : ఉద్యోగుల భవనానికి కేటాయించిన స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ డైరెక్టర్ ఈవి నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట మండలంలోని యూనియన్ నాయకులు ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం

నార్కట్‌పల్లి : ఎమ్మెల్యే వేముల వీరేశం–పుష్ప దంపతుల పెళ్లిరోజు సందర్భంగా మండల కేంద్రంలోని అక్షర మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం, ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బండ సాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పులెల్లం అచ్చాలు, ఐతరాజు యాదయ్య, సిద్దగోని స్వామి, బింగి కొండయ్య, గడ్డం పశుపతి, బింగి మహేష్, శ్రవణ్‌కుమార్ మాదాసు నర్సింహ, ప్రజ్ఞాపురం సత్తి, సమద్, రవి, రహీం పాల్గొన్నారు.

కేతేపల్లి: ఎమ్మెల్యే వేముల వీరేశం వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేతేపల్లి మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, జటంగి వెంకటనర్సయ్యయాదవ్, అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి, కోట పుల్లయ్య, మట్టి సాల్మన్, జటంగి సైదులు పాల్గొన్నారు.


కేతేపల్లి : ఎమ్మెల్యే వేముల వీరేశానికి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి


వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కేతేపల్లి: ఎలాంటి కొర్రీలు లేకుండా అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం నాయకులు కేతేపల్లి తహసీల్దారు మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉన్న వారికే రుణమాఫీ వర్తిస్తుందనే నిబంధన విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు కోట లింగయ్య, ఎ.సుధీర్, ఎల్.రాజు, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

నార్కట్‌పల్లి : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును బీజేపీ స్వాగతిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అమ్మనబోలు గ్రామంలో ఆయన మాట్లాడారు. అమ్మనబోలు గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. పాల్వాయి భాస్కర్‌రావు, సంతోష్, మండల అధ్యక్షుడు కొరివి శంకర్, పోచం వెంకటేశ్వర్లు, శివ, ప్రకాష్‌రెడ్డి, రమేష్, శ్రీపతి రాకేష్ పాల్గొన్నారు.